క్లుప్తంగా

యూరియా పంపిణీ పరిశీలన



యూరియా పంపిణీని పరిశీలిస్తున్న అధికారులు

పెద్దపంజాణి: మండల కేంద్రమైన పెద్దపంజాణిలోని గ్రోమోర్ ఎరువుల దుకాణంలో చేపట్టిన యూరియా పంపిణీని గురువారం జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆరు రైతు సేవా కేంద్రాలు, రాయలపేట, పెద్దపంజాణిలో ని ప్రైవేటు డీలర్ల వద్ద యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులు ఆందోళన చెందకుండా యూరియా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ శివకుమార్, ఏవో హేమలత పాల్గొన్నారు.

త్వరితగతిన సర్వేలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న డీఎల్‌డీవో రామచంద్ర

బైరెడ్డిపల్లె : గ్రామాల్లో నిర్వహిస్తున్న స్వామిత్వ, కౌశలం, ఆధార్ సీడింగ్ తదితర సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని డీఎల్‌డీవో రామచంద్ర ఆదేశించారు. ఆయన గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి, ఏవో ఆనందబాబు, డిప్యూటీ ఎంపీడీవో నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు



ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

సదుం: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కింద మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్నట్టు చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్లు గాయత్రి, చరణ్ తెలిపారు. వారు గురువారం సదుం విలేజ్ క్లినిక్ పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఇల్లు, సమాజం బాగుపడతాయని తెలిపారు. వైద్య శిబిరాల్లో స్పెషలిస్టులు వైద్య సేవలు అందిస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో సిబ్బంది నీలకంఠ, జానకి, శిఖామణి, హేమలత, సరస్వతి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌కు గురైన బాలుడికి రూ.లక్ష సాయం



బాలుడి తండ్రికి నగదు అందజేస్తున్న ఎస్‌డీపీఐ నాయకులు

పుంగనూరు: గత వారం విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడిన పుంగనూరు కొత్తపేటకు చెందిన బాలుడికి ఎస్‌డీపీఐ నాయకులు సిద్దిక్, ఆసిఫ్, షామీర్, చాంద్‌బాషా రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. బాలుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అతిక్‌బాషా, నౌషాద్, బాషా, మహమ్మదాలి, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

వి.కోట: కర్ణాటకకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురువారం స్పెషల్ బ్రాంచ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వి.కోటకు చెందిన అష్రఫ్‌అలీ తన లగేజీ ఆటోలో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా కర్ణాటక సరిహద్దు రాజపేట రోడ్డు వద్ద పోలీసులు పట్టుకున్నారు. అష్రఫ్‌అలీ, మహ్మద్ బాషా కుమారుడు షరీఫ్‌ను అరెస్టు చేశారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తప్పవు

పలమనేరు: పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనాలపై చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి హెచ్చరించారు. ఆయన గురువారం టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి జౌవుళివీధి, మదనపల్లి రోడ్డు, కాకాతోపు, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. చాలా ఇళ్లను అనుమతి లేకుండానే నిర్మిస్తున్నట్టు తెలుసుకున్నారు. ఏపీ లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం కింద జూన్ 30 నాటికి అప్రూవల్ చేసుకున్న వారికి ఇబ్బంది ఉండదని తెలిపారు. టీపీవో ఇందిర, ఆర్‌వో అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ బోల్తాపడి యువకుడికి తీవ్ర గాయాలు

పుంగనూరు: పట్టణంలోని ఈస్ట్‌పేట వద్ద గురువారం బైక్ బోల్తాపడడంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. మొరుంపల్లెకు చెందిన నాగరాజ కుమారుడు గంగరాజు(22) బైక్‌లో పుంగనూరు బయలుదేరాడు. ఈస్ట్‌పేట వద్ద అదుపుతప్పి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగ విద్యార్థులకు పరీక్షలు

పలమనేరు: గుడియాత్తం రోడ్డులో వున్న విద్యానగర్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం పలమనేరు డివిజన్‌లోని దివ్యాంగ విద్యార్థులకు ఏఎల్ఐఎంసీవో వైద్యులు మెడికల్ అసెస్‌మెంట్ క్యాంపు నిర్వహించారు. 90 మందికి పరీక్షలు చేసి అవసరమైన వారికి తగిన చికిత్స అందించనున్నట్టు జిల్లా అధికారి వెంకటరమణ తెలిపారు. ఎంఈవో బాలసుందరం, పలు మండలాలకు చెందిన స్పెషల్ ఎడ్యుకేటర్లు, భవిత సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరు సమీపంలోని చెన్నై- బెంగళూరు జాతీయ రహదారిలో గతంలో జరిగిన మేజర్ ప్రమాదాలు







పది కిలోమీటర్లకు పది గండాలు!

చెన్నై- బెంగళూరు జాతీయ రహదారిలోని పలమనేరు నుంచి మొగిలి ఘాట్ మధ్య దశాబ్దాలుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. గత పదేళ్లలో 30 మందికి పైగా మృతి చెందారు. ప్రమాదాల నివారణకు అధికారులు అనేక చర్యలు తీసుకుంటున్నా ఫలితం మాత్రం లేదు. ఇక్కడున్న మలుపులు, ఇంజినీరింగ్ లోపాలు, రోడ్డు చాలా డౌన్‌లో వుండడం, మధ్య డివైడర్ నిర్మించడమే ప్రమాదాలకు కారణమని స్థానికులు చెబుతున్నారు. సిమెంట్ రోడ్డు అన్ లెవెలింగ్ కూడా ప్రమాదాలు జరిగేందుకు కారణంగా కనిపిస్తోంది.

- పలమనేరు, మొగిలి మధ్య తగ్గని ప్రమాదాలు
- ప్రమాదకరంగా మారిన పది కిలోమీటర్లు
- గత టీడీపీ ప్రభుత్వంలో వేసిన సిమెంట్ రోడ్డే కారణమా!

పలమనేరు: మొగిలి ఘాట్‌లో మలుపులు ఎక్కువగా వున్నాయి. రోడ్డు విస్తరణకు ముందు గాంధీనగర్ వద్దనున్న మలుపులో ఎక్కువగా ప్రమాదాలు జరిగేవి. ఫోర్ వే వేశాక దొరచెరువు మలుపును సరిచేయలేదు. దీనికితోడు ఇక్కడ రోడ్డు చాలా డౌన్‌లో ఉండడం వల్ల వాహనాల్లో వచ్చే వారికి ముందున్న రోడ్డు కనిపించడం లేదు. ఈ మలుపులో వేగంగా వచ్చి సడెన్‌గా టర్న్ చేయడంలో విఫలమై వాహనాలు డివైడర్‌ను దాటి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. దీనికి తోడు ఘాట్‌లో రోడ్డుకు మధ్య నిర్మించిన డివైడర్ ఎత్తు చాలా తక్కువగా ఉంది. ఫలితంగా డౌన్‌లో వేగంగా వచ్చే వాహనాలు ఉన్నట్టుండి డివైడర్‌పై నుంచి పక్కనున్న రోడ్డులోకి వెళ్లిపోతున్నాయి. ఈ మార్గంలో కర్ణాటక రాష్ట్ర సరిహద్దు నంగిళి నుంచి చిత్తూరు వరకు అప్పట్లో టీడీపీ ప్రభుత్వం ప్రయోగాత్మకంగా సిమెంట్ రోడ్డు వేశారు. రోడ్డు అన్‌లెవలింగ్ కారణంగా వాహనాలకు గ్రిప్ దొరక్క ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా భారీ వాహనాలైన కంటైనర్లు, లాంగ్ క్యారియర్, గూడ్స్ లారీలే ఎక్కువగా అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి.

మానవ తప్పిదాలు

బెంగళూరు నుంచి వంద కిలోమీటర్ల వేగంతో వచ్చే వాహనాలు అదే స్పీడ్‌తో ఘాట్‌లోనూ వెళ్లడం ప్రమాదాలకు కారణమవుతోంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే డ్రైవర్లు అలసటతోపాటు మద్యం సేవించడం వల్ల ఘాట్‌లో వీచే చల్లని గాలికి నిద్రలోకి జారుకుంటున్నారు. తద్వారా ప్రమాదాల బారిన పడుతున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్నా..

మొగిలి ఘాట్‌లో రోడ్డు ప్రమాదాల నివారణకు ఎన్‌హెచ్, ట్రాన్స్‌పోర్ట్, పోలీసు శాఖల అధికారులకు సుప్రీం కోర్టు పలు సూచనలను చేసింది. ఆ మేరకు వరుసగా మూడు చోట్ల రంబుల్ స్పీడ్ బ్రేకర్లు, రోడ్డుకు ఇరువైపులా సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తూ ఘాట్‌లోకి రాగానే వాహన వేగాన్ని పూర్తిగా తగ్గించేలా స్లో జోన్ ఏర్పాటు చేశారు. అలాగే డెడ్లీ యాక్సిడెంట్ జోన్ అంటూ బోర్డులు ఏర్పాటు చేసి డ్రైవర్లు అప్రమత్తమయ్యేలా సోలార్ లైట్లు, మలుపుల వద్ద భారీ లైటింగ్, రేడియం రిఫ్లెక్టెడ్ స్టిక్కర్లు పెట్టారు.

టీడీపీ ప్రయోగమూ ఒక కారణం

చెన్నై-బెంగుళూరు జాతీయ రహదారిలో బంగారుపాళ్యం నుంచి కర్ణాటకలోని నంగిళి వరకు నాలుగో నంబరు జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా అప్పటి టీడీపీ ప్రభుత్వం 84 కిలోమీటర్ల మేర తారు రోడ్డుకు బదులు సిమెంట్ రోడ్డు వేసింది. రోడ్డు నిర్మాణం సక్రమంగా సాగలేదు. లెవలింగ్ సరిగా చేయలేదు. మొగిలి ఘాట్‌లో మలుపును సరిచేయలేదు. దీంతో వాహనాల చక్రాలకు గ్రిప్ దొరకకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

మొగిలి ఘాట్‌లో ప్రమాదాలను ఎలా నివారించాలో...



మొగిలి ఘాట్‌పై బయటి డ్రైవర్లకు అవగాహన లేదు. కాస్త నిర్లక్ష్యం చూపినా ప్రమాదాలు జరగడం ఖాయం. ఈ క్రమంలో రాష్ట్ర స్థాయిలో జరిగే ప్రతి కార్యక్రమంలోనూ ఘాట్ రోడ్డు డ్రైవింగ్‌పై డ్రైవర్లకు అవగాహన కలిస్తున్నాం. ఇక్కడ ప్రమాదాలను ఎలా నివారించాలో అధికారులకే అర్థం కావడం లేదు.

– జీలు, లారీ ట్రాన్స్‌పోర్ట్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, పలమనేరు

నిధానమే ప్రధానమనే మాట మరిచిపోతున్నారు



మొగిలి ఘాట్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వీటి నివారణ కోసం పలు చర్యలు తీసుకున్నాం. ఘాట్‌లో నిదానంగా వెళ్లాలనే ప్రాథమిక సూత్రాన్ని డ్రైవర్లు మరిచిపోతున్నారు. అందువల్లే ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

– మధుసూదన్, ఎంవీఐ, పలమనేరు

మౌలిక వసతుల కల్పనకు కృషి



తాగునీటి బోరును పరిశీలిస్తున్న అధికారులు

పెద్దపంజాణి: గిరిజన కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తహసీల్దార్ హనుమంతు, ఎంపీడీవో బాలాజి తెలిపారు. వారు గురువారం నాగిరెడ్డిపల్లి పంచాయతీ కడపల్లి, కోగిలేరులో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. గిరిజనులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. బడిఈడు పిల్లలను బడికి పంపించాలని, బాల్య వివాహాలు చేయరాదని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హేమలత, ఏపీవో మురుగేషన్, పీఎస్ చంద్రశేఖర్, వీఆర్వో బాలాజి, ఎంసీవో సుధాకర్ పాల్గొన్నారు.

మెలియోయిడోసిస్ వ్యాధిపై విచారణ




బండకిందపల్లెలో విచారిస్తున్న జిల్లా అధికారులు

రొంపిచెర్ల: మెలియోయిడోసిస్ వ్యాధిపై జిల్లా ఆరోగ్య అధికారులు రొంపిచెర్ల మండలంలో గురువారం విచారణ జరిపారు. చెంచెంరెడ్డిగారిపల్లె పంచాయతీ మూరేవాండ్లపల్లెకు చెందిన నరసింహులు బండకిందపల్లె గ్రామ సచివాలయంలో ఉద్యానవన శాఖ సహాయకులుగా పని చేస్తున్నారు. గత నెలలో కడుపు నొప్పి రావడంతో వేలూరు సీఎంసీలో చికిత్స చేయించుకున్నారు. అతనికి మెలియోయిడోసిస్ వ్యాధి వున్నట్టు డాక్టర్లు గుర్తించారు. ఈ క్రమంలో అతనితోపాటు పని చేస్తున్న సచివాలయ ఉద్యోగులు, కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వినయ్, సీహెచ్‌వో అమ్మణ్ణి, హెల్త్ ఎడ్యుకేటర్ రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా యూరియా పంపిణీ

చౌడేపల్లె: జిల్లా వ్యాప్తంగా గురువారం 125 క్లస్టర్ల ద్వారా 20,400 బస్తాల యూరియా పంపిణీ చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి జె.మురళీకృష్ణ తెలిపారు. ఆయన గురువారం ఏడీఏ శివకుమార్‌తో కలిసి చౌడేపల్లె, చారాలలో యూరియా పంపిణీని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు వరిపంటతో పాటు గడ్డి పెంపకానికి యూరియా వాడకం తగ్గించాలని తెలిపారు. యూరియా పంపిణీని పారదర్శకంగా చేపడుతున్నట్టు తెలిపారు. ఏవో మోహన్‌కుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

మొరవ పారుతున్న ఏటి చెరువు



రొంపిచెర్ల మండలంలో మొరవ పోతున్న ఏటీ చెరువు



బడబళ్ల వంకలో మొరవ పోతున్న చెక్ డ్యామ్‌లు

రొంపిచెర్ల: తలకోన అటవీ ప్రాంతంలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కప్పలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నీరు రొంపిచెర్ల మండలం గానుగచింత పంచాయతీలోని ఏటి చెరువుకు చేరడంతో మొరవ పోతుంది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అలాగే బండకిందపల్లె పంచాయతీలోని బడబళ్ల వంకపై నిర్మించిన చెక్ డ్యామ్‌లు నిండి మొరవ పోతున్నాయి. వర్షం బాగా పడితే బడబళ్లవంక ప్రాజెక్టు కూడా మొరవ పోతుందని రైతులు తెలిపారు.

పార్టీ బలోపేతంలో కార్యకర్తలే కీలకం



సమావేశంలో పాల్గొన్న మాజీ ఎంపీ రెడ్డెప్ప తదితరులు

పుంగనూరు/సదుం : వైఎస్సార్ సీపీని గ్రామ స్థాయి నుంచి పటిష్టం చేయడంలో కార్యకర్తలే కీలకమని ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి (యాక్టివిటీ) వజ్రభాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప తెలిపారు. వారు గురువారం పుంగనూరులోని 19, 22 వార్డుల్లో కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. అలాగే సదుం మండలం ఊటుపల్లె పంచాయతీలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలిసారి పుంగనూరు నియోజకవర్గంలో కార్యకర్తలతో నేరుగా టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడే అవకాశాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతి విషయాన్ని కార్యకర్తలకు నిమిషాల్లో చేరేలా ప్రణాళికలు రూపొందించినట్టు తెలిపారు. ఇది విజయవంతమైతే రాష్ట్ర వ్యాప్తంగా అమలుచేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశాల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి అనీషారెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్‌షరీఫ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆవుల అమరేంద్ర, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఇర్ఫాన్, కౌన్సిలర్ పూలత్యాగరాజు, సదుంలో పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కల్యాణ్ భరత్, బాబురావు, గురు, గిరిధర్ రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ స్వరూప, మురళీ యాదవ్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

పలమనేరు: గంటావూరు వైఎస్సార్ నగర్, గడ్డూరు కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్‌డీపీఐ నిర్వాహకులు ముబారక్‌బాషా, మహబూబ్ కోరారు. వారు గురువారం మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. కాలువలు లేక మురుగు నీరు వీధుల్లోనే ప్రవహిస్తోందన్నారు. స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ తప్పకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ముందుగా గుర్తిస్తే క్యాన్సర్‌కు చెక్

పలమనేరు: క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే నయం చేయవచ్చని కొలమాసనపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సుధారాణి తెలిపారు. ఆమె గురువారం పీహెచ్‌సీలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం కింద మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం బాగుంటుందని తెలిపారు. వైద్యులు యుగంధర్, ప్రవీణ్, మీనా, మాధవి తదితరులు పాల్గొన్నారు.

చలో మెడికల్ కాలేజీని విజయవంతం చేద్దాం

పలమనేరు: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌కు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం నిర్వహించనున్న చలో మదనపల్లి మెడికల్ కళాశాల కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యం నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం వైఎస్సార్‌సీపీ యూత్ నేతల సమావేశం నిర్వహించారు. నాయకులు హేమంత్‌కుమార్‌రెడ్డి, ముజ్జు, రాజేష్‌నాయుడు, గోవిందురెడ్డి, మహబూబ్, రామక్రిష్ణ, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కేబుల్ గుంతలు



పలమనేరు: పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఇటీవల కేబుల్ గుంతలను తవ్వి వాటిని సరిగ్గా పూడ్చకుండా వదిలేయడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. స్థానిక చెరువు కట్ట నుంచి బొమ్మిదొడ్డి దాకా రోడ్డు పక్కన తవ్విన గుంతల కారణంగా రోడ్డు నుంచి వాహనం పక్కకు దిగిందంటే కింద పడాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై ఆర్‌అండ్‌బీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

హోరా హోరీగా క్రీడా పోటీలు

పులిచెర్ల(కల్లూరు) : కల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం అండర్-14, 17 క్రీడా పోటీలు హోరా హోరీగా జరిగాయి. వాలీబాల్, కబడ్డీ పోటీల్లో మంగళంపేట, కల్లూరు ఎల్లంకివారిపల్లె, పులిచెర్ల హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు కల్లూరు లయన్స్ క్లబ్ సభ్యులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు సిద్దరామయ్య, పోకల తాతయ్య, హెచ్ఎం శ్రీవాణి, లయన్స్ క్లబ్ జిల్లా క్రీడా విభాగం అధ్యక్షుడు మహమ్మదాలీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

పెద్దపంజాణి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని శంకర్రాయలపేట జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. పాఠశాల క్రీడా మైదానంలో గురువారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడ విజేతలుగా నిలిచిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పీఈటీ చంద్రశేఖర్, ప్రసూన, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

బైరెడ్డిపల్లె : బైరెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రెండు రోజులుగా నిర్వహిస్తు న్న అండర్ 14, 17 మండల స్థాయి క్రీడా పోటీ లు గురువారం ముగిశాయి. నెల్లిపట్ల, కడపనత్తం, బైరెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలు, గురు కుల పాఠశాల, మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపినట్టు స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ చిరంజీవి తెలిపారు. వీరు నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.



బైరెడ్డిపల్లె : ప్రతిభ చూపిన విద్యార్థులతో పీడీలు



విజేతలతో ఉపాధ్యాయులు

ముగిసిన క్రీడా పోటీలు

రొంపిచెర్ల: రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాల లో నిర్వహించిన అండర్ 17 క్రీడా పోటీలు గు రువారం ముగిసినట్లు హెచ్ఎం ధనలక్ష్మీ తెలిపా రు. ఇక్కడ గెలుపొందిన విద్యార్థులను జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. అనంతరం విజేతలకు షీల్డ్‌లు అందజేశారు. పీఈటీ ఉపాధ్యాయులను సన్మానించారు.



రొంపిచెర్ల : క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులు

నేడు వైద్య నిర్ధారణ పరీక్షలు

సదుం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక అవసరాలు కల పిల్లలకు ఏఎల్ఐఎంసీవో ఆధ్వర్యంలో వైద్య నిర్ధారణ పరీక్ష శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎంఈవో నటరాజు తెలిపారు. శిబిరానికి వచ్చేవారు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, యూడీఐడీ కార్డు, ఫొటో తీసుకురావాలని సూచించారు. నియోజకవర్గంలోని పాఠశాలల్లో ఉన్న ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు హాజరయ్యేలా హెచ్ఎంలు చొరవ చూపాలని సూచించారు. వివరాలకు 9989976530, 9502901224 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నాలుగు డీఏలు వెంటనే ఇవ్వాలి

పెద్దపంజాణి: పెండింగులో వున్న నాలుగు డీఏలను వెంటనే ఇవ్వాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. వారు గురువారం బాబురెడ్డి అధ్యక్షతన స్థానిక ఎంపీపీ పాఠశాలలో మండల శాఖ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శి గురుప్రసాద్ మాట్లాడుతూ పీఆర్సీ కమిటీని నియమించి దసరాకు ఐఆర్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వాసన్న, అంజాద్ ఆలీఖాన్, శివప్రకాష్ బాబు, నారాయణ స్వామి, హరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని మహిళా సంఘాల సభ్యులకు గురువారం కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పించారు. పరిశ్రమల జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేసుకోవడం వల్ల సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి వ్యాపారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

వరకట్నం కేసు నమోదు

పుంగనూరు: మండలంలోని చంద్రమాకులపల్లెకి చెందిన నవనీతను అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్టు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ నవనీతకు 12 ఏళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన మంజునాథ్‌తో వివాహమైందన్నారు. మంజునాథ్ తల్లి భాగ్యమ్మ, మేనత్త లక్ష్మీదేవి, ఆడబిడ్డ శోభారాణి అదనపు కట్నం కోసం నవనీతను వేధిస్తున్నారని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోండి

శాంతిపురం: హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ నుంచి అందుబాటులో ఉన్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ఉద్యాన శాఖ అధికారిణి వింధ్య కోరారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ జామ, చీనీ, నిమ్మ, సపోటా, టిష్యుకల్చర్ అరటి, బొప్పాయి, అవకాడో తదితర తోటలు, పూలు, మష్రూమ్, హైబ్రీడ్ కూరగాయల సాగుకు రాయితీలు ఇస్తున్నట్టు తెలిపారు. నీటి కుంటలు, పాలీ హౌస్, ప్యాక్ హౌస్, మల్చింగ్ షీట్, షేడ్ నెట్, ప్రైమరీ ప్యాకింగ్, మినీ ట్రాక్టర్, శాశ్వత పందిళ్లకు పథకం వర్తిస్తుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు స్థానిక రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు

పులిచెర్ల(కల్లూరు) : స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కింద మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేస్తున్నట్టు కల్లూరు పీహెచ్‌సీ వైద్యులు ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆయన గురువారం పీహెచ్‌సీలో సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు హరిప్రియ, సుబ్రమణ్యం, పుష్పకుమారి, ప్రసాదరావు, అజిత, షఫీ తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు

పుంగనూరు: మండలంలోని భరిణేపల్లి వద్ద గురువారం బైక్‌ను ఆటో ఢీకొనడంతో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఏడూరు గ్రామానికి చెందిన శ్రీనాథ్(17), ప్రసాద్(18), ఆకాష్(17) బైక్‌లో పుంగనూరు బయలుదేరారు. భరిణేపల్లి వద్ద వేగంగా వస్తున్న ఆటో ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని స్థానికులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వైద్యులు మదనపల్లెకు పంపించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.